

పీడీఎస్ బియ్యం కలిగిన 13 గొడౌన్లపై క్రిమినల్ కేసులు నమోదు

- దర్యాప్తు చేస్తున్నామన్న కాకినాడ పోర్టు సీఐ

7లో



అడ్డగోలుగా చదును చేసేసిన మడ భూములివే..

'చదును'బాగోలే!

- కాకినాడలో మడ భూముల అడ్డగోలు చదునుపై ఎన్జీటీ తీర్పునకు తూట్లు
- 58 ఎకరాల్లో చదును చేసిన మట్టంతా తొలగించి కొత్త మొక్కలు నాటాలని రెండేళ్ల కిందట ఆదేశాలు
- అయినా ఇప్పటికీ పట్టించుకోని అధికారులు: ప్రభుత్వం మారినా ఇంకా అదే అలక్ష్యం
- నేడు మడ భూములు పరిశీలించనున్న వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రప్రసాద్
- ఎన్జీటీ ఆదేశాలకు తూట్లు పొడిచిన వైనాన్ని వివరించనున్న పర్యావరణవేత్తలు
- మడ భూములు అని తెలిసినా గత వైసీపీ ప్రభుత్వంలో మొక్కలు నరికి చదును
- ఇందుకోసం ఏకంగా రూ.16కోట్లు వెచ్చించిన కార్పొరేషన్, గుడా, రెవెన్యూ అధికారులు
- మడ విధ్వంసంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అప్పట్లో రూ.5కోట్లు జరిమానా విధించిన ఎన్జీటీ
- తప్పులను అడ్డగోలుగా సమర్థించుకున్న అప్పటి కలెక్టర్లు మురళీధర్‌రెడ్డి, కృతికాశుక్లా
- మడ విధ్వంసం, అడ్డగోలు నిధుల ఖర్చుపై బాధ్యులపై చర్యలకు కొత్త ప్రభుత్వం దృష్టి



ఇన్‌సెట్‌లో ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం(ఫైల్)

అవి అత్యంత విలువైన మడభూములు.. తప్పని తెలిసినా గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా నరికేశారు. సరికదా.. ఇళ్లస్థలాల ముసుగులో 58 ఎకరాలను ఏకంగా చదును చేసేశారు. ఇదంతా తప్పని జాతీయ హరిత ట్రిబ్యునల్ అధికారులకు అక్షింతలు వేసింది. చేసిన తప్పునకు జరిమానా రూ.5కోట్లు విధించింది. తక్షణం చదును చేసిన మట్టిని తొలగించి కొత్తగా మడ మొక్కలు నాటాలని ఆదేశించింది. ఇది జరిగి రెండేళ్లు దాటుతున్నా ఇప్పటికీ అధికారులు ఎన్జీటీ ఆదేశాలను పట్టించుకోలేదు.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

హరిత ట్రిబ్యునల్ తీర్పు ఇస్తే మాకేంటి అనుకున్నారో ఏమో.. అసలు ఖాతరే చేయలేదు. ఇంతవరకు మట్టిని తొలగించలేదు. కొత్త మొక్కలను నాటలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఎన్జీటీ తీర్పునకు అధికారులు తూట్లు పొడిచారు. ఈ నేపథ్యంలో వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలవబడే ప్రముఖ జాతీయ పర్యావరణవేత్త రాజేంద్రసింగ్ నేడు మడ భూముల పరిశీలనకు వస్తున్నారు. ఇక్కడ ఎన్జీటీ తీర్పునకు అధికారులు ఎలా తూట్లు పొడిచారో ఇతర పర్యావరణవేత్తలతో కలిసి తెలుసుకోనున్నారు. కాగా నిబంధనలకు విరుద్ధంగా మడమొక్కలను నరికేసి భూములు చదును చేయడానికి కాకినాడ కార్పొరేషన్, గుడా, రెవెన్యూశాఖ కలిపి ఏకంగా రూ.16కోట్లు వృథా ఖర్చు చేశాయి. ఈ నిధుల అడ్డగోలు వ్యయభాగోతంపై కొత్త ప్రభుత్వం ఆరా తీయడం మొదలు పెట్టింది.

ఎన్జీటీ చెప్పినా అదే తీరు

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పేరుతో గత వైసీపీ ప్రభుత్వం కాకినాడ నగరంలో 31,505మంది లబ్ధిదారులకు స్థలాల కోసం 2020లో అధికారులు అన్వేషించారు. తీరా ఎక్కడా చాలినన్ని భూములు లేకపోవడంతో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి దుమ్ములపేటలో యాంకరేజ్ పోర్టు భూములపై కన్నేశారు. ఆ భూములు ఇవ్వమని పోర్టు మొత్తుకున్నా సర్వే నెంబరు 374,376,387లో 116 ఎకరాలను లాగేసుకున్నారు. వాస్తవానికి ఈ భూముల్లో అత్యంత విలువైన మడ మొక్కలున్నాయి. అయినా పట్టించుకోకుండా వీటిని నరికేశారు. వేలాది చెట్లను తొలగించి మొత్తం భూమిని చదును చేసేశారు. దీనిపై విశాఖకు చెందిన పర్యావరణవేత్త బొలిశెట్టి సత్య జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అక్కడ మడ భూములను నిర్ధాక్షిణ్యంగా నరికేసి భూములు చదును చేసేశారని ఫిర్యాదు చేశారు. అయినా ఇదేదీ ఖాతరు చేయకుండా ఎమ్మెల్యే అధికారులతో పనులు కొనసాగించేశారు. అప్పటి కలెక్టర్ మురళీధర్‌రెడ్డి కార్పొరేషన్, గుడా, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి చదును ఖర్చు ఎంతనేది అంచనా వేయించారు. మడ భూములు చిత్తడి నేలలు కావడంతో 116 ఎకరాల చదునుకు రూ.25కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. దీంతో కలెక్టర్ ఈ నిధులను కాకినాడ కార్పొరేషన్ నుంచి రూ.5కోట్లు, గుడా నుంచి రూ.5కోట్లు, రెవెన్యూశాఖ నుంచి రూ.6కోట్లు వరకు కేటాయించి రూ.16కోట్లు చదును పేరుతో ఖర్చుచేశారు. ఈ పనులకు టెండరు పిలవకుండా అడ్డగోలుగా ద్వారంపూడి మనిషికి కట్టబెట్టారు. మడ భూములు నరికివేశారన్న ఫిర్యాదుపై విచారణ చేపట్టిన ఎన్జీటీ అక్కడ మడ మొక్కలు ఉన్నాయో లేదా తేల్చాలని 2020 మేలో కమిటీని నియమించింది. ఆ కమిటీ స్థల పరిశీలనకు వచ్చినపుడు ప్రభుత్వ ఒత్తిడితో అప్పటి కలెక్టర్ మురళీధర్‌రెడ్డి తప్పుడు నివేదికలు సృష్టించారు. అవి మడ భూములు కాదని, అక్కడ మడమొక్కలు లేవంటూ అటవీ, రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులతోను కమిటీ ఎదుట అబద్ధాలు చెప్పించారు. కానీ జేఎన్టీయూకే నిపుణుల కమిటీ ఇక్కడ పరిశీలించి, పర్యావరణవేత్తలు అందించిన శాటిలైట్ చిత్రాలు, నివేదికల ఆధారంగా అవన్నీ మడమొక్కలని నిర్ధారణ చేసి ఎన్జీటీకి నివేదిక అందించింది. దీని ఆధారంగా చదును చేసిన 116 ఎకరాల్లో 58 ఎకరాల్లో మడ మొక్కలున్నాయని ఎన్జీటీ తన తీర్పులో స్పష్టం చేసింది. జరిగిన విధ్వంసం నేపథ్యంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.5కోట్ల జరిమానా విధించింది. చదును చేసిన స్థలంలో మట్టి పూర్తిగా తొలగించి కొత్తగా మడ మొక్కలు పెంచి ఐదేళ్లపాటు పర్యవేక్షించాలని ఆదేశించింది. ఇదంతా అమలు చేసి నివేదిక ఇవ్వాలని అప్పటి కలెక్టర్ కృతికాశుక్లాను ఆదేశించింది. ఇక్కడే మళ్లీ ఎన్జీటీ కళ్లకు కలెక్టర్ గంతలు కట్టారు. చదును చేసిన మట్టిని తొలగించకుండానే అందులోనే అక్కడక్కడా మడ మొక్కలు నాటేసి ఎన్జీటీకి నివేదిక పంపారు. దీనిపై పర్యావరణవేత్తలు మళ్లీ ఎన్జీటీని ఆశ్రయించగా మట్టి పూర్తిగా తొలగించాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది.

బాధ్యులపై చర్యలకు రంగం సిద్ధం

ఎన్జీటీ ఆదేశించినా ఇంతవరకు మడభూముల్లో చదును చేసిన మట్టిని తొలగించలేదు. ఇప్పటికీ అక్కడ మడ భూముల్లో మట్టి వర్షాలకు గట్టి బడిపోయింది. ఒక్క మడ మొక్క కూడా కనిపించడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే ఎన్జీటీ ఆదేశాలకు అధికారులు నిలువునా తూట్లు పొడిచారు. తమ తప్పేం లేదని చెప్పేందుకు గనులశాఖ కొన్నినెలల కిందట టెండర్లు పిలిచి చదును చేసిన మట్టి తవ్వి తరలించుకు వెళ్లడానికి రూ.5కోట్లు చెల్లించేవారు ముందుకు రావాలని కోరింది. కానీ ఒక్కరంటే ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఈసాకుతో మడ భూములను అలా వదిలేసి ఎన్జీటీ ఆదేశాలను అమలు చేయకుండా పక్కనపడేశారు. ఈ నేపథ్యంలో ఇదే పరిస్థితి కొనసాగితే మడ మొక్కల పునరుద్ధరణ అసాధ్యమని పర్యావరణవేత్తలు వాదిస్తున్నారు. చదును ఆలస్యమవడంతో ఆ తర్వాత ఎప్పుడో ఆ పనిచేసినా చిత్తడి నేలలు తిరిగి పూర్వస్థితికి రావని, అప్పుడు మొక్కలు నాటినా ప్రయోజనం ఉండదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల తీరును ఎన్జీటీ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. పర్యావరణానికి ఏవిధంగా తూట్లు పొడిచారో స్వయంగా చూడడానికి శుక్రవారం వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన ప్రముఖ పర్యావరణవేత్త రాజేంద్రసింగ్ కాకినాడకు వస్తున్నారు. మధ్యాహ్నం నేరుగా బొలిశెట్టి సత్య ఇతర పర్యావరణవేత్తలతో కలిసి మడ భూములు పరిశీలించనున్నారు. అధికారులు ఎలా ఎన్జీటీ ఆదేశాలకు తూట్లు పొడిచారో స్వయంగా తెలుసుకోనున్నారు. తద్వారా అధికారులపై చర్యలు కోరుతూ ఎన్జీటీని ఆశ్రయించనున్నారు. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా మడ భూముల చదునుకు రూ.16కోట్లు వెచ్చించి మట్టిపాలు చేసిన నేపథ్యంలో అధికారులపై కొత్త ప్రభుత్వం దృష్టిసారించింది. అప్పటి ఎమ్మెల్యే ఆదేశాలకు అనుగుణంగా అడ్డగోలుగా వ్యవహరించిన నేపథ్యంలో సంబంధిత అధికారులను బాధ్యులను గుర్తించబోతోంది. మరోపక్క డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం మడ విధ్వంసంపై దృష్టి సారించారు. అటవీ, పర్యావరణశాఖలు పవన్ పరిధిలో ఉండడంతో ఇప్పటికే బొలిశెట్టి సత్య ఈ వ్యవహారాన్ని ఆయనకు వివరించారు. ఈ నేపథ్యంలో మడ విధ్వంసకారులపై మున్ముందు గట్టి చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించనుంది.

అనుమతి లేని ఫ్లెక్సీలు తొలగించండి

- సెప్టెంబర్ కల్లా ఫ్లెక్సీ ఫ్రీ సిటీ లక్ష్యం: కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), జూలై 25: అనుమతి లేని ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతావారోత్సవాల్లో భాగంగా వెంకట్‌నగర్‌లోని సురేష్ చికెన్ సెంటర్ నుంచి సాయిబాబా ఆలయం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ భావన ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో అనుమతిలేని ఫ్లెక్సీలన్నింటినీ తొలగించాలని టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. అనుమతిలేని ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లను తొలగించేందుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలనికోరారు. అనుమతిలేని ఫ్లెక్సీలను తొలగించడం ద్వారా సెప్టెంబర్‌నాటికల్లా కాకినాడను ఫ్లెక్సీ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగర సుందరీకరణను దృష్టిలో ఉంచుకుని ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. అలా తొలగించని పక్షంలో నగరపాలక సంస్థ తరపున తొలగించి వాటిని ఏర్పాటు చేసిన సంస్థలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.



కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఫ్లెక్సీ తొలగిస్తున్న కమిషనర్ భావన

నిర్వాసిత ప్రాంతాల్లో బ్రేక్ వాటర్ నిర్మాణం చేపట్టాలి

- కోత నివారణపై సైంటిస్టుల సమక్షంలో మత్స్యకారుల అభిప్రాయం



సముద్రకోత నివారణపై మత్స్యకారుల అభిప్రాయాలను తెలుసుకొంటున్న సైంటిస్టులు

కొత్తపల్లి, జూలై 25: తరచూ కోతకు గురవుతున్న తీరప్రాంతంలో మత్స్యకారులు నివాసం ఉంటున్న ఏరియాల్లో సముద్రంలో బ్రేక్‌వాటర్ నిర్మాణం చేపట్టి శాశ్వతంగా కోత నివారించవచ్చునని మత్స్యకారులు ముక్తకంఠంతో తెలియజేశారు. తీరప్రాంత గ్రామాలను సముద్ర కోతనుంచి రక్షించాలని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉప్పాడ విచ్చేసిన పవన్‌కళ్యాణ్‌కు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎంగా ఆయన ఆదేశాలమేరకు నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ మినిస్ట్రీఆఫ్‌ఎర్త్ సైన్సెస్ శాస్త్రవేత్తలు సత్యకిరణ్‌రాజు, సన్‌ది సుధీర్, ప్రీతి శేఖర్‌ల బృందం గురువారం ఉప్పాడ, అమీ నాబాద్ తీరప్రాంత గ్రామాల్లో కోత నివారణకు మత్స్యకారులనుంచి అభిప్రాయసేకరణ నిర్వహించారు.కాకినాడ పోర్టులో బ్రేక్‌వాటర్ నిర్మించడంవల్ల కెరటాలు నేరుగా ఉప్పాడ వైపునకు రావడంతో తరచూ తీరప్రాంత గ్రామాలు కోతకు గురవుతున్నా యని అమీనాబాద్ సర్పంచ్ నక్కా మణికంఠ, ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి జాన్, మత్స్యకార నాయకులు చొక్కాప్రసాద్, సూరాడరాజు సైంటిస్టులకు తెలిపారు. ఉప్పాడతో తీరప్రాంత గ్రామాలను కోతనుంచి శాశ్వతంగా రక్షించుకునేందుకు కాకినాడవైపు ఉన్న హోప్ ఐలెండ్ వద్ద బ్రేక్‌వాటర్ నిర్మాణం చేపట్టాలన్నారు. మత్స్యకారులు తెలియజేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్‌లో ఉప్పాడకోతను శాశ్వతంగా నివారించేందుకు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్తా మని సైంటిస్టుల బృందం మత్స్యకారులకు హామీ ఇచ్చారు. జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, కొత్తపల్లి ఎంపీడీవో పి.వెంకటనారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, మత్స్యకార నాయకులు సూరాడనాగేశ్వరరావు, చవ్వాకుల వెంకటరమణ, ఓసిపల్లి జగన్నాథం, హెచ్‌ఆర్సీ ప్రతినిధి జాన్ పాల్గొన్నారు.

ఐటీ ఇనిస్టిట్యూట్‌ను పిఠాపురంలో ఏర్పాటు చేయాలి

- కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కోరిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



కేంద్రమంత్రి ధర్మేంద్రతో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్

కార్పొరేషన్(కాకినాడ)/పిఠాపురం, జూలై 25: కేంద్రప్రభుత్వవిద్యాసంస్థ అయిన నేషనల్‌ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని పిఠాపురం నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ కోరారు. మచిలీపట్టణం ఎంపీ బాలశౌరీతో ఢిల్లీ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కలిసి ఈ విషయంపై విన్నవించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో దీన్ని ఏర్పాటు చేస్తే ఇక్కడి విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉం టుందని వివరించారు. దీనిపై కేంద్రమంత్రి స్పందిస్తూ ఇనిస్టిట్యూట్‌ను పిఠాపురం నియోజకవర్గంలో ఏర్పాటు చేయడానికిగల అవకాశాలను పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటానని హామీఇచ్చారు. అనంతరం కాకినాడ పార్లమెంటు పరిధిలో విద్యారంగానికి సంబంధించిన పలు అంశాలపై వీరి మధ్య చర్చ జరిగింది.

జిల్లాలో దివ్యాంగులకు ప్రత్యేక శిబిరాలు

- పరికరాల ఆవశ్యకత గుర్తింపు
- జిల్లావ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా క్యాంపుల నిర్వహణకు ఆదేశాలు

పిఠాపురం, జూలై 25: జిల్లాలో దివ్యాంగులకు అవసరమైన చలన, ఇతరపరికరాలను గుర్తించేందుకు నియోజకవర్గాలవారీగా శిబిరాలునిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏఎల్ఐఎమ్‌సీఓ(అలిమ్కో) సంస్థ ఆధ్వర్యంలో వీటి నిర్వహణకు కలెక్టరు షాన్‌మోహన్ ఆదేశాలు జారీచేశారు. శిబిరాల్లో దివ్యాంగులకు ఏ పరికరాలు అవసరమో గుర్తిస్తారు. వీటిని క్రోడీకరించి పరికరాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతారు. గుర్తించిన లబ్ధిదారులకు పంపిణీ తేదీ, ప్రదేశాన్ని తెలియజేస్తారు.

ఎక్కడెక్కడ...?

జిల్లాలో తొలుతగా ఆగస్టు 2న పిఠాపురం పట్టణంలోని రథాలపేట సెంటర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు శిబిరం ఏర్పాటు చేస్తారు. ఇందులో పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాలు, పిఠాపురం మునిసిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల పరిధిలోని వికలాంగులు పాల్గొనవచ్చు. 3న జగ్గంపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగే శిబిరంలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాలు, 4న కాకినాడ నగరంలోని అంబేడ్కర్ భవనంలో జరిగే శిబిరంలో కాకినాడ నగరంతోపాటు తాళ్లరేవు, కాజులూరు మండలాలు, 6న తుని మునిసిపల్ కార్యాలయ ఆవరణలో తుని, కోటనందూరు, తొండంగి మండలాలు, తుని మునిసిపాలిటీ పరిధి, 7న ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలు, 8న కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే శిబిరంలో కాకినాడ రూరల్, కరప, పెదపూడి మండలాలు, 9న పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే శిబిరంలో పెద్దాపురం, సామర్లకోట మండలాలు, మునిసిపాలిటీల పరిధిలోని వికలాంగులు పాల్గొని పరికరాలు పొందేందుకు వీలుగా జరిగే గుర్తింపు పక్రియలో పాల్గొనవచ్చు.

ఎవరు అర్హులు..

దారిద్ర్యరేఖకు దిగువన ఉండి సంవత్సర ఆదాయం రూ.2.70లక్షలకు మించనివారు. భౌతిక అవసరాలకు అనుగుణంగా సహాయక ఉపకరణాలు వినియోగం అవసరమైన ఉండాలి. అన్ని ఉపకరణాలకు 40శాతం వైకల్యం, బ్యాటరీ ఆపరేటింగ్ సైకిల్ కోసం 80శాతం వైకల్యం తప్పనిసరి. అర్హతనుబట్టి ఒకటి కంటే అధికంగా ఉపకరణాల కోసం గుర్తించే అవకాశం ఉంది.

అవసరమైన పత్రాలు

శిబిరానికి వచ్చే దివ్యాంగులు జిరాక్స్ కాపీలతోపాటు కొన్ని పత్రాలు తీసుకురావాల్సి ఉంటుంది. సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు తప్పనిసరి. రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, చిరునామా రుజువు కోసం రేషన్‌కార్డు లేదా ఏదొక గుర్తింపు కార్డు. రెండు ఫొటోలు తీసుకెళ్లాలి. శిబిరాల నిర్వహణపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులకు సూచించారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన

- తుని, తొండంగిల్లో కలెక్టర్ షాన్‌మోహన్ పర్యటన
- ప్రభుత్వాస్పత్రులు, పాఠశాలల్లో తనిఖీలు
- సౌకర్యాల్లో లోపాలపై ఆరా.. సిబ్బందికి సూచనలు



తొండంగి మండలం ఏవీ నగరం ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

తుని రూరల్, జూలై 25: తుని, తొండంగి మండలాల్లో కలెక్టర్ షాన్‌మోహన్ సుడిగాలి పర్యటన చేశారు. తుని ఏరియా ఆస్పత్రిని ఆయన పరిశీలించారు. ప్రసూతి విభాగం, అత్యవసర విభాగం, స్త్రీ, పురుష వార్డులు, లేబరేటరీ ఔట్‌పేషెంట్ వివరాలు, ఫార్మసీ, పెడియాట్రిక్, ఏఆర్‌టీ సెంటర్ ట్రామాకేర్ తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో స్వయంగా మాట్లాడారు. వైద్యసేవలు, భోజన సదుపాయాలు, పారిశుధ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు పైకప్పు శ్లాబు నుంచి నీళ్లు దిగి ట్రామాకేర్ విభాగంలో కూలిన శ్లాబు పెచ్చులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులకు, ఇంజనీరింగ్ అధికారులకు బిల్డింగ్ నాణ్యతా ప్రమాణాలపై పలు సూచనలు ఇచ్చారు. పలు వార్డుల్లో పారిశుధ్య పనులు సక్రమంగా లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పనితీరు మెరుగుపరుచుకోవాలని నిబంధనలు పాటించి పారిశుధ్య పనులు చేపట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ సెక్యూరిటీ, పారిశుధ్య సిబ్బంది వస్తున్న ఫిర్యాదులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శస్త్రచికిత్సల సమయంలో ప్రైవేట్ వ్యక్తుల సహాయంతో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని, రోగులకు డ్రెస్సింగ్, వార్డు షిఫ్టింగ్ పనులకు డబ్బులు ఇస్తే తప్ప ఆస్పత్రుల్లో పనులు జరగడం లేదని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రైవేట్ సెక్యూరిటీ నిర్లక్ష్య వైఖరిపై సంబంధిత నివేదిక అందజేయాలని సీఐ గీతారామకృష్ణకు ఆదేశించారు. ఆస్పత్రిలో పారిశుధ్య పనులకు మున్సిపల్ పారిశుధ్య సిబ్బందిని పంపించి పనులు చక్కబెట్టాలన్నారు. ఆసుపత్రి సిబ్బందే ఈ పనులు సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తుని మున్సిపల్ కమిషనర్ వెంకటరావును ఆదేశించారు. తుని ఏరియా ఆస్పత్రికి దగ్గరలో అన్నాక్యాంటీన్ పనులను కలెక్టర్ పరిశీలించారు. గడువు లోపు పనులు పూర్తి చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

తొండంగి పాఠశాల, ఏవీ నగరం పీహెచ్‌సీల పరిశీలన

తొండంగి, జూన్ 25: తొండంగిలో కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం పర్యటించారు. ముందుగా ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఫార్మసీలో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది పరిశీలించారు. ఆస్పత్రి ప్రసవాలపై ప్రశ్నించగా నెలకు ఐదు వరకూ జరుగుతున్నట్లు తెలిపారు. ఇటీవల ఆస్పత్రి ప్రసవాలు తదితర విభాగాల్లో సాధించిన ప్రగతికి సంబంధించి నేషనల్ సర్టిఫికేషన్‌కు ఆస్పత్రి ఎంపికైనట్లు వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. సమస్యల గురించి అడగ్గా తమ ఆస్పత్రికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కొమ్మనాపల్లి వాటర్ ప్లాంట్ ద్వారా విడదలయ్యే తాగునీరు సరిగ్గా ఫిల్టర్ కాకపోవడంతో నాణ్యత లేని నీటినే తాగాల్సి వస్తోందని టీడీపీ నేత కొయ్యా రామకేశవ వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన తొండంగి ఉన్నత పాఠశాలను సందర్శించారు. తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం, విద్యాబోధనపై ఆరా తీశారు. పాఠశాలలో జరుగుతున్న పనుల గురించి ప్రశ్నించారు. జీఎంపేటలో ఉన్న చెత్త ద్వారా సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీకంపోస్టు, చెత్తసేకరణ, షెడ్ నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆవరణలో కొబ్బరి మొక్క నాటారు. అనంతరం ఆయన తుని బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట సీఎంవో చామంతి నాగేశ్వర్రావు, ఎంఈవోలు షేక్‌బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి ఉన్నారు.



తుని ఏరియా ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్







గోదావరి వరద ప్రవాహంలో విలువైన కలప కొట్టుకొస్తోంది.. వరద గోదావరిలో గత మూడు, నాలుగు రోజులుగా ఎక్కువగా కట్టెలు వస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం వద్ద గోదావరిలో కొట్టుకొచ్చిన కట్టెలు, పుల్లలను పలువురు సేకరించి వాహనాలపై తరలిస్తున్నారు.

- మండపేట



జెన్‌కో కాలనీలో కొండ చిలువ కలకలం

మోతుగూడెం, జూలై 25: మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టు జెన్‌కో కాలనీ పోస్టాఫీసు వీధిలో పది అడుగుల కొండ చిలువ కలకలం సృష్టించింది. బుధవారం అర్ధరాత్రి కుంపోతగా వర్షం కురుస్తున్న సమయంలో పొట్టునూరి స్వర్ణ ఇంట్లో మంచం కింద చుట్టుకుని ఉన్న కొండ చిలువ కనిపించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై చుట్టుపక్కల వాళ్లని పిలిచారు. ట్రాక్టరు డ్రైవరు చిన్నారావు ఆటో డ్రైవరు నాగకోన శంకరరావు కొండ చిలువను చాకచక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ సంచిలో వేసి సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

గోదావరి మరింత తగ్గుముఖం

- దవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- 13.40 అడుగులకు చేరిన నీటిమట్టం
- 12.27లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 25: గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద గురువారం ఉదయం 9 గంటలకు నీటిమట్టం 13.70 అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఈ సమయంలో 12,27,028 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. నెమ్మదిగా తగ్గుతూ రాత్రి 7గంటల సమయానికి 13.40 అడుగులకు చేరుకుంది. 12,27,273 క్యూసెక్కులు బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తోంది. ఎగువున భద్రాచలం వద్ద 45.20 అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం ఇంద్రావతి నుంచి వస్తున్న వరద నీటితో 24 గంటల వ్యవధిలో మూడున్నర అడుగుల వరకు పెరిగి గురువారం సాయంత్రానికి 48.60 అడుగులుగా నమోదైంది. ప్రస్తుతం నిలకడగా కొనసాగుతుండగా ఇంద్రావతి నుంచి వచ్చే వరద నీరు తగ్గడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుముఖం పట్టనుంది.

ఎగువున అన్ని ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. గురువారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద 11.07 మీటర్లు, పేరూరు వద్ద 16.33 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.20 మీటర్లు, భద్రాచలం వద్ద 48.60 అడుగులు, కూనవరం వద్ద 20.17 మీటర్లు, కుంట వద్ద 11.50 మీటర్లు,పోలవరం వద్ద 12.90 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.62 మీటర్లుగా నీటిమట్టం నమోదయ్యింది.


బ్యారేజీ గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు





ఎజికొడేరులో వరద బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వరద నీటిలో వరరామచంద్రపురం మండలం శ్రీరామగిరి

నెమ్మదించిన శబరి

చింతూరు వద్ద నీటమట్టం 37 అడుగులు

చింతూరు, జులై 25: శబరి ఉధృతి నెమ్మదిగా తగ్గుతోంది. అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు వద్ద నీటిమట్టం గురువారం రాత్రికి 37 అడు గులకు చేరుకుంది. చింతూరు డివిజన్‌లోని వాగులు, వంకల్లో ఇంకా వరద నీరు ఉండడంతో రాకపోకలు సాగట్లేదు. దీంతో ఆయా ప్రాంతాల వాసులు నాటు పడవలపై ప్రయాణం చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి తిరిగి 48.6 అడుగులకు చేరుకుని నిలకడగా ఉంది. దీంతో కూనవరం, వర రామచంద్రపురం మండలాల్లో గోదావరి ఎగపోటు ప్రభావం కన్పిస్తోంది. చింతూరు మండలం డొంకరాయి జల విద్యుత్ కేంద్రం రిజర్వాయరు నుంచి ఒక్క గేటు ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఆ నీరంతా శబరిలోకి చేరుతోంది. చింతూరు డివిజన్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ దినేష్‌కుమార్ బృందం విస్తృతంగా పర్యటిస్తోంది. బాధితులకు అందుతున్న సహాయ సహకారాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు రేషన్‌తో పాటు కందిపప్పు, వంటనూనె, నిత్యావసరాలు అందజేస్తున్నారు.

మండలానికో ఐఏఎస్ అధికారి

చింతూరు డివిజన్లో 177 గ్రామాలు వరద ప్రభావితమయ్యాయి. బాధితులకు సహకారాలు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన చింతూరు మండలంలోని ఎజికొడేరు, మల్లెతోట, ఉలుమూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతూరు డివిజన్లో వరద బాధితులకు సహాయ సహకారాలు అందజేసే విషయంలో పూర్తిస్థాయి పర్యవేక్షణ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ప్రతి మండలానికి ఒక్కో ఐఏఎస్‌ను నోడల్ అధికారిగా నియమించారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య... మండలానికి ఒకరు వంతున పర్యవేక్షణ చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. వారికి తోడుగా చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు.


డొంకరాయి జలాశయం నుంచి దిగువకు నీటిని వదిలిన దృశ్యం

పెరిగిన నీటిమట్టం

డొంకరాయి జలాశయం నుంచి 2173 క్యూసెక్కుల నీరు విడుదల

మోతుగూడెం, జూలై 25: విడవకుండా కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయంలో నీటిమట్టం బుధవారం అర్ధరాత్రి 1036 అడుగులకు పెరిగింది. జెన్‌కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక గేటును రెండు అడుగులు ఎత్తి 2,173 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామని జెన్‌కో ఈఈ విజయ్ కుమార్ తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని, ఇన్‌ఫ్లోస్ తగ్గితే నీటి విడుదల నిలిపివేస్తామన్నారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

ఏలేశ్వరం, జూలై 25: ఏలేరు కాలువలో పడి మండలంలోని మర్రివీడు శివారుకు చెందిన ముంగర కాళహస్తి (57) మృతి చెందాడు. కాళహస్తి మర్రివీడు నుంచి ప్రాజెక్టుకు వెళ్లే కాలువలో చేపలు పట్టడానికి గురువారం దోనెపై వెళ్తుండగా నీటి ప్రవాహం, గాలికి అది హఠాత్తుగా నీటితో మునిగిపోయింది. సమీపాన ఉన్న గ్రామస్థుడు చంద్రయ్య ఇచ్చిన సమాచారం మేరకు కాలువలో గాలించినా ఆచూకీ తెలియలేదు. తన భర్త ఆచూకీ తెలియట్లేదని కాళహస్తి భార్య లక్ష్మి ఏలేశ్వరం పోలీసులకు సమాచారం అందించింది. దీంతో వారు గాలింపు చర్యలను ఉధృతం చేశారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు కాలువ వద్ద మృతదేహం లభ్యమైంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.


మృతుడు కాళహస్తి (పాత చిత్రం)


హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి హుండీల ఆదాయం

రూ.26.80 లక్షలు

అయినవిల్లి, జూలై 25: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలను దేవదాయ శాఖ జిల్లా అధికారి డి.నాగమల్లేశ్వరరావు, తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం తెరిచి కానుకలను లెక్కించారు. 63 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.25,70,643, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.1,09,702... మొత్తం రూ.26,80,345 ఆదాయం వచ్చింది. 11 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. లెక్కింపులో ముక్తేశ్వరం ఎస్‌బీఐ ప్రతినిధులు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు టీటీడీ అధికారుల రాక

సత్యదేవుని ఆలయ శిఖరం స్వర్ణతాపడం అంచనాకు పరిశీలన

అన్నవరం, జూలై 25: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని ఆలయ శిఖరం స్వర్ణతాపడం చేయించాలనే ప్రతిపాదనకు దేవదాయ శాఖ కమిషనరు అనుమతి లభించిన సంగతి తెలిసిందే. అంచనాల కోసం టీటీడీ జ్యూయలరీ విభాగం అధికారులు శుక్రవారం పరిశీలన చేయనున్నారు. గతంలో ఒకసారి పరిశీలించగా సుమారు 11 కేజీల బంగారం పడుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే పూర్తిస్థాయిలో నివేదికను శుక్రవారం తయారు చేసి కమిషనర్ అనుమతితో దాతల సహకారంతో దీనిని ఏర్పాటుచేయాలని ఆలోచన చేస్తున్నారు.

సీఐల బదిలీలకు రంగం సిద్ధం!

- మన్యం సహా కీలక స్థానాల కోసం ఎమ్మెల్యేల వద్ద పైరవీలు
- కొన్ని నియోజకర్గాల్లో పెద్ద ఎత్తున సాగుతున్న బేరసారాలు
- ఆయా సీఐల గత చరిత్రను పరిశీలించాకే పోస్టింగ్

రంపచోడవరం, జూలై 25: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పోలీసు శాఖలో ఆయా రేంజ్‌లలో కీలకమైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎమ్మెల్యేల వద్ద పైరవీలు మొదలయ్యాయి. మన్యంతో పాటు 19 నియోజకవర్గాల్లో అనేక స్టేషన్లు, సర్కిళ్లకు సీఐలను బదిలీ చేయడం అనివార్యం కానుంది. ఏ నియోజకవర్గంలో ఎవరుండాలన్న అంశంపై ఎమ్మెల్యేల కంటే ఆయా సీఐలకే ఎక్కువ క్లారిటీ ఉంది. వారు తమకు నచ్చిన స్థానం కోసం బేరసారాలు సాగిస్తూ దళారులతోను, నేరుగాను పావులు కదుపుతున్నారు.

కొందరు సీఐలను ఎన్నికల సంఘం నియమావళి మేరకు ఎన్నికలకు ముందే ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. వారంతా తిరిగి ఉమ్మడి తూర్పుతో ఏదో ఒక కీలక స్టేషన్, సర్కిల్ లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. వైసీపీతో పూర్తిగా అంటకాగి కొందరు, గోడ మీద పిల్లి వాటంలా మరికొందరు ఉంటే అప్పటి ఎమ్మెల్యేలకు అనుకూలం కాక లూపు లైన్లలో ఇంకొందరు ఉండిపోయారు. ప్రభుత్వం ఏది ఉన్నా పైరవీలు సాగించడంలో చేయితిరిగిన సదరు సీఐలు ఇప్పుడు కూడా ముందు వరుసలోనే ఉన్నారు. మరికొందరైతే గతంలో ఆయా ప్రాంతాల్లో తమకు పరిచయం ఉన్న ద్వితీయ శ్రేణి నాయకత్వాలను దళారీలుగా ఉపయోగించుకుని పైరవీలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల ఆయా స్థానాలకు రేట్లు కూడా పలికాయి. కాకినాడ, రాజమహేంద్రవరం పరిధిలో 15 నుంచి 30 లకారాలకు పైగా పలికించి గిరాకీ పెంచారు. మరికొందరైతే తమకు వచ్చే వాటిలో కూడా వాటాలు చెల్లిస్తామన్న భరోసా కూడా ఇస్తున్నారు.

ఈ వ్యవహారాలు ఇలా సాగుతుండగా ఆయా రేంజ్ డీఐజీల ద్వారాను, హోం మంత్రి ద్వారాను ఎమ్మెల్యేల సిఫార్సులను అందుకుంటున్న ప్రభుత్వం ఈ అంశంలో కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చిన ప్రతి సిఫార్సులోని సీఐల గత చరిత్రను జిల్లాతో పరిచయం ఉన్న ఓ పోలీసు ఉన్నతాధికారితో పరిశీలన సాగించుకుని పర్వాలేదు అనుకున్న వారికి మాత్రమే పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతే కాకుండా గత ప్రభుత్వంలో అకారణంగా పక్కనపెట్టబడిన వారిని కూడా పరిశీలనలోకి తీసుకుని ప్రాధాన్యమివ్వాలని చూస్తోంది.

రేపు, ఎల్లుండి ఎస్పీ బాలు స్వర స్మరణోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 25: ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలు స్వర స్మరణోత్సవాన్ని ఈ నెల 27, 28 తేదీల్లో విక్రమ హాల్లో నిర్వహిస్తున్నామని రాకా సంస్థ ప్రధాన కార్యదర్శి జి.రమణ తెలిపారు. రాజమహేంద్రవరం రాకా సాంస్కృతిక సంస్థ, ధవళేశ్వరం గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎస్పీ బాలు పాటల పోటీలు ఉంటాయని, బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. వివరాలకు 832805 9683, 91007 53156 నెంబర్లలో సంప్రదించాలన్నారు. సంగీత ప్రియులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల మెరుపుదాడి

14మంది అరెస్టు, రూ.77వేలు స్వాధీనం

మండపేట, జూలై 25: ఏడిద శివారు చింతాలమ్మ గుడి సమీపంలో దుళ్ల వెళ్లే రోడ్డులో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో పేకాట శిబిరంపై గురువారం దాడి చేసినట్టు మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపారు. కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలు, యానాం తదితర ప్రాంతాలకు చెందిన 14మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.77,260 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై రూరల్ ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అవినాష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి

అంతర్జాతీయ చదరంగం పోటీలకు

సాయిఅవినాష్ ఎంపిక

మామిడికుదురు, జూలై 25: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మొగలికుదురు శ్రీచైతన్య స్కూలు విద్యార్థి పి.సాయిఅవినాష్ అంతర్జాతీయ స్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యాడు. 8వ తరగతి చదువుతున్న అవినాష్ ఇటీవల పంజాబ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిపోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని శ్రీచైతన్య ఏజీఎం పార్థసారథి, ఆర్ఐ రాజ్‌కుమార్, అడకమిక్ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, డీన్ రమేష్ గురువారం అభినందించారు.

హత్య కేసులో నిందితుడికి

జీవిత ఖైదు

11 సంవత్సరాల తర్వాత తుది తీర్పు ఇచ్చిన కోర్టు

జగ్గంపేట, జూలై 25:

హత్య కేసులో నిందితుడైన జగ్గంపేటకు చెందిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గురువారం కోర్టు తీర్పునిచ్చింది. దీనికి సంబంధించి జగ్గంపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2013లో జగ్గంపేట శెట్టిబలిజపేటకు చెందిన వానశెట్టి సింహాచలం తన భార్య అక్రమ సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో ఒక వ్యక్తిపై దాడి చేశాడు. అక్కడి నుంచి నేరుగా తన భార్య అక్రమ సంబంధానికి కారణమైన శెట్టిబలిజపేటకు చెందిన బత్తిన భవాని ఇంటికి వెళ్లాడు. ఆమె భోజనం చేస్తుండగా కల్లుగీసే కత్తితో నరికి చంపాడు. దీనిపై 2013లోనే జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి దర్యాప్తు చేపట్టగా గురువారం కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. దాదాపు 11 సంవత్సరాల తర్వాత తుది తీర్పు వెలువరించింది. అయితే దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసిన అప్పటి సీఐ పి.భరత్‌మాతాజీ, డీఎస్పీ బి.సూర్యఅప్పారావు, ప్రస్తుత సీఐ ఎస్.లక్ష్మణరావు, పీపీ మృత్యుంజయరాజులను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అభినందించారు.

పీడీఎస్ బియ్యం కలిగిన 13 గొడౌన్లపై క్రిమినల్ కేసులు నమోదు

దర్యాప్తు చేస్తున్నామన్న కాకినాడ పోర్టు సీఐ సుమంత్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 25: పీడీఎస్ బియ్యం కలిగి ఉన్న నేపథ్యంలో కాకినాడ జిల్లాలో 13 గొడౌన్ల యాజమాన్యాలపై పోలీసులు తాజాగా క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ కట్టి దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రధానంగా కాన్‌కోర్ బియ్యం గొడౌన్, ఎస్ఆర్ జ్యోతి, హెచ్ గొడౌన్, అశోకా ఇంటర్నేషనల్, సార్టెక్స్ ఇండియా, సాయితేజ షిప్పింగ్ సర్వీసెస్, విశ్వప్రియ ఎక్స్‌పోర్ట్స్, లావణ్య ఇంటర్నేషనల్, అయ్యప్ప ఎక్స్‌పోర్ట్స్, శ్రీనివాసా ట్రేడింగ్ అండ్‌కో, సరళ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బ్లూఓషియన్ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్, సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పీడీఎస్ (కెర్నెల్స్) ఫోర్టిఫైడ్ బియ్యాన్ని రాష్ట్రంలో ఎక్కడెక్కడి నుంచి సేకరించారు, దీన్ని కాకినాడ పోర్టుకు ఎలా తరలిస్తున్నారు, తర్వాత ఇతర దేశాలకు ఎలా ఎగుమతి చేస్తున్నారు.. అనే కోణంలో దర్యాప్తు సాగుతున్నట్టు తెలిసింది. గత నెలలో చేసిన దాడుల్లో 50,647 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. ఇందులో 26,488 మెట్రిక్ టన్నుల బియ్యం కెర్నెల్స్ కలిగిన ఫోర్టిఫైడ్‌గా గుర్తించారు. 13 గొడౌన్ల యజమానులపై 6(ఎ) కేసులు నమోదు చేశారు. తాజాగా పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గత ఐదేళ్లలో రూ.800కోట్ల పీడీఎస్ బియ్యం ఇతర దేశాలకు ఎగుమతి అయినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పీడీఎస్ బియ్యం సేకరణ ఎలా జరిగిందనే అంశంపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. పైగా కాకినాడ యాంకరేజ్ పోర్టు, డీప్ వాటర్ పోర్టు, కుంభాభిషేకం వంటి ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. పీడీఎస్ బియ్యం రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు అవుతున్నాయి. ఈ విషయమై కాకినాడ పోర్టు సీఐ సుమంత్‌ను సంప్రదించగా... పీడీఎస్ బియ్యం కలిగిన గొడౌన్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు..

కాకినాడ

'నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలి'

కరప, జూలై 25: విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని రుచిగా అందించాలని టీడీపీ, జనసేన మండలపార్టీ అధ్యక్షులు దేవు వెంకటేశ్వర రావు, బండారు మురళి సూచించారు. కరప మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలను గురువారం కూటమి నాయకులతో కలిసి వారు సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ పి.వెంకటరామకృష్ణారావు, నాయకులు యాళ్ల వీరవెంకటసత్యనారాయణ, పి.పవన్‌కుమార్, శ్రీనుపాల్గొన్నారు.



కోటనందూరులో తాండవ రిజర్వాయర్ కింద దెబ్బతిన్న గ్రోయిన్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

తాండవ గ్రోయిన్స్‌ను ఆధునికీకరించండి

● కలెక్టర్ షాన్‌మోహన్

కోటనందూరు, జూలై 25: తాండవ రిజర్వాయర్ కింద దెబ్బతిన్న గ్రోయిన్స్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గురువారం మండలంలోని కోటనందూరులో గ్రోయిన్స్, బొద్దవరంలో కొబ్బరితోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి పంటలకు నీరు అందేలాగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి రూ.6లక్షలు నిధులు మంజూరు చేస్తామని యుద్దప్రాతిపదికన సుమారు 20 రోజులలోపు పనులు చేయాలన్నారు. అలాగే శాశ్వత ప్రాతిపదికన తాండవ కింద ఉన్న దిగువాలా, కామినీడు, అల్లిపూడి, రామరాజు కట్టు గ్రోయిన్స్ ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి కామినీడు గ్రోయిన్‌కు రూ.1,36కోట్లు, దిగువాలా గ్రోయిన్‌కు రూ.0.40 లక్షలు, అల్లిపూడి గ్రోయిన్‌కు రూ.0.20లక్షలు, ఇండుగపల్లిలో గల బొండుగెడ్డపై ఉన్న రామరాజు కట్టుకు రూ. 1. 85 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశామని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు తెలిపారు. అలాగే బొద్దవరం ఉపాధి హామీ పథకంలో చేపట్టిన నర్సరీ మొక్కలను పరిశీలించారు. కొబ్బరిలో అంతర పంటలు వేయాలని సూచించారు. రైతులను అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాకరాపల్లి గ్రామంలో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని జనసేన కార్యకర్తలు తెలపగా వివరాలు పంపించాలని కోరారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఈ సురేష్, మాజీ ఎంపీపీ డి. చిరంజీవిరాజు, కొయ్యా కేశవ, అంకంరెడ్డి రాజశేషు, పెనుముచ్చు ప్రవీణ్, లగుడు సత్యనారాయణమూర్తి, చింతకాయల రవికుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ కోసం

ప్రత్యేక అవగాహన తరగతులు

● సీ పోర్టు, పడాల ట్రస్టు సీఈవోలు ● మురళీధర్, సూర్యప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

కాకినాడ సిటీ, జూలై 25: స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ పేరిట బాలికల సంరక్షణ కోసం ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని కాకినాడ సీ పోర్ట్సు లిమిటెడ్ సీఈవో మెర్ల మురళీధర్, పడాల ఛారిటబుల్ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పడాల సూర్యప్రసాద్ వెల్లడించారు. కాకినాడలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గతేడాది డిసెంబర్ 18న సీ పోర్ట్సు సహకారంతో పడాల ఛారిటబుల్ ట్రస్టు ప్రారంభించామన్నారు. చిన్నపిల్లలపై లైంగిక వేధింపులు నివారించే దిశగా ఈ కార్యక్రమం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు జరుగుతోందన్నారు. గత కలెక్టర్ కృతికాశుక్లా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 7వ తరగతి పిల్లలకు ప్రైవేట్ పార్ట్స్, సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, సేఫ్టీ రూల్స్, పోస్కో చట్టం, ఇంటర్నెట్ సేఫ్టీ వంటి విషయాలు పర్సనల్ సేఫ్టీ ఎడ్యుకేషన్ అనే మాడ్యువల్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారన్నారు. గత రెండేళ్లలో ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 20వేల మంది పిల్లలను చేరుకున్నామన్నారు. పిల్లల భద్రత, రక్షణ మనందరి బాధ్యత, ప్రతి పాఠశాల, కళాశాల, హాస్టల్, ఇంట్లో పిల్లలు క్షేమంగా ఉండాలనే లక్ష్యంతో సీ పోర్ట్సు సహకారంతో జిల్లా విద్యాశాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నా మన్నారు. కోఆర్డినేటర్ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాలి

కిర్లంపూడి, జూలై25: మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీడీపీవో ఎం.పూర్ణిమ అన్నారు. గురువారం మండలంలోని సోమవరం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళలు, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్నారులు, బాలికలపై లైంగిక దాడులకు పాల్పడడం దారుణమన్నారు. సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడుల నివారణ కోసం ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం టీడీపీ నాయకులు విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగిరెడ్ల దొరబాబు, మంచికంటి శ్రీను, బీజేపీ నాయకులు యడాలి రాంబాబు, అర్జంపూడి శ్రీనివాస్, శీరంప్రభాకర్, రాజేష్ ఉన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి : సెట్రాజ్ సీఈవో మూర్తి

కరప, జూలై 25: సమాజంలో జరుగుతున్న మోసాలపట్ల విద్యార్థిను లు అప్రమత్తంగా ఉండాలని సెట్రాజ్ సీఈవో ఏవీఎస్ఎన్ మూర్తి సూచించారు. కరప జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 9, 10, ఇంటర్ విద్యార్థినులకు మహిళల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యుక్త వయసులో వచ్చే శారీరక, మానసిక మార్పుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అవసరం మేరకు సెల్‌ఫోన్లను వినియోగించాలని, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ చదువు పట్ల ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. ట్రైనర్ రమ్యసుధ మాట్లాడుతూ బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ మారెళ్ల శ్రీరామచంద్రమూర్తి, పెద్దింట్లమ్మ అనంతలక్ష్మి, సుదర్శన్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ట్రస్టీగా చాగంటి ప్రమాణం



కరప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా ప్రమాణస్వీకారం చేస్తున్న చాగంటి వెంకట్రావు

కరప, జూలై 25: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా చాగంటి వెంకట్రావును నియమిస్తూ దేవదాయ, ధర్మాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో గురువారం ఆలయంలో దేవదాయశాఖాధికారులు వెంకట్రావుతో ప్రమాణస్వీకారం చేయించారు. నిస్వార్థంగా పని చేస్తూ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఈ సందర్భంగా ఆయన ప్రమాణం చేశారు. ధర్మకర్తగా నియమితులైన వెంకట్రావును ఈ సందర్భంగా పలువురు అభినందించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పి.ఫణీంద్రకుమార్, ఈవోలు కె.తిరుమలరవితేజ, మోర్తా మురళీవీరభద్రరావు, వద్దాది సత్తిబాబు, డి.శ్రీనివాస్, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ డైరెక్టర్ చాగంటి సూరిబాబు, వీఆర్‌వో చాగంటి వరుణ్, టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కెనాల్ రోడ్లో కారు బోల్తా : వ్యక్తికి గాయాలు

సామర్లకోట, జూలై 25: సామర్లకోట మండలం జీ.మేడపాడు సమీపాన కెనాల్ రోడ్లో గురువారం తెల్లవారుజామున కారు బోల్తా పడిన సంఘటన లో కారు నడుపుతున్న వ్యక్తి గాయపడ్డాడు. పెదబ్రహ్మదేవం గ్రామానికి చెందిన కారుగా సామర్లకోట పోలీసులు గుర్తించారు. పెదబ్రహ్మదేవం గ్రామానికి చెందిన ఒక పాఠశాల యజమాని సామర్లకోట నుంచి పెదబ్ర హ్మదేవం వెళుతుండగా జీ.మేడపాడు సమీపించేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో పెద్దగోతిలోకి వేగంగా దిగిపోవడంతో కారు బోల్తా పడింది. ఆ సమయంలో కారు నడుపుతున్న వ్యక్తికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'రైతులకు పంట రుణాలు అందించాలి'

గండేపల్లి, జూలై25: రైతులకు పంట రుణాలు అందించాలని మండల వ్యవసాయాధికారి సద్గురుమూర్తి అన్నారు. గురువారం ఆయన మండలంలోని మురారి బ్యాంక్ ఆఫ్ బరోడా, జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లను సందర్శించారు. ఆయా బ్రాంచ్ మేనేజర్లకు కౌలుదారుల వివరాలు అందించి ప్రభుత్వాదేశాల మేరకు రుణాలు అందించి వారి తోడ్పాటుకు సహకరించాలని కోరారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు జాన్, ఉదయ్, సాయికిరణ్ ఉన్నారు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లకు దూరంగా ఉండండి

● కాకినాడ నగర కమిషనర్ భావన పిలుపు ● ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన ర్యాలీ



కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), జూలై 25: భావితరాల భవిష్యత్, పర్యావరణానికి హాని కలిగే తక్కువ మందం కలిగిన సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లకు దూరంగా ఉండాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ పిలుపునిచ్చారు. కాకినాడ 27వ డివిజన్ తిలక్ వీధిలోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలవద్ద ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిషేధించిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌వల్ల కలిగే అనర్థాలు వివరించారు. వీటికి దూరంగా ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిన కాటన్ బ్యాగులను ఉపయోగించాలని సూచించారు. మాజీ మేయర్ సుంకర పావని, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

కాకినాడసిటీ: రీ సైక్లింగ్ చేసే అవకాశం లేని ప్లాస్టిక్‌ను అతిగా వాడక ంవల్ల భవిష్యత్‌లో పెను ప్రమాదమే ఎదురవుతుందని పర్యావరణవేత్తలు సైతం భయపడుతున్నారని ప్రముఖ స్పోకెన్ ఇంగ్లీషు కోచ్ జంధ్యాల అరవింద్ మాస్టారు అన్నారు. స్థానిక గంజాంవారివీధి నుంచి దేవాలయంవీధి మీదుగా బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం వరకు ప్లాస్టిక్ వాడకం నిషేధంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి కాగితపు సంచులను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ జనసేన ఇన్‌చార్జి సుంకర సురేష్, డివిజన్ నాయకులు నల్లూరి తులసి, ఉప్పులూరి వీరభద్రరావు, సత్యంశెట్టి రాజేష్, భమిడిపాటి సిద్ధు, విశాలి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

పెద్దాపురం: పర్యావరణ పరిరక్షణలో ప్రతీఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో మాదిరెడ్డి ఉషారాణి అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె గురువారం పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పలు ప్రదేశాల్లో గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు, ఆధార్ క్యాంప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీకట్ల లక్ష్మీ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కల్తూరి శ్రీనివాస్, ప్రసన్నకుమార్, సురేష్, వీహెచ్‌ఏ చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో చెత్తను తొలగించిన అధికారులు

తాళ్లరేవు: తాళ్లరేవు మెయిన్‌రోడ్డుపై ఉన్న చెత్తను పంచాయతీ కార్యదర్శి శంకర నారాయణ, సచివాలయం సెక్రటరీ వేగుపోలరావుల ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ సిబ్బంది చెత్తను తొలగించారు. ముత్యాలమ్మగుడి దగ్గర నుంచి తహసీల్దార్ కార్యాలయం ఉన్న చెత్తని జంగిల్ క్లీయరెన్స్‌నితొలగించి ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తరలించారు. పంచాయతీ వార్డు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

తుని రూరల్: పరిసరాల పరిశుభ్ర తతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు స్పష్టం చేశారు. స్వచ్ఛవారోత్సవాల్లో భాగంగా తుని పట్టణంలో 5, 6వార్డుల్లో పిచ్చిమొక్కలు తొలగించి డ్రైన్లు శుభ్రపరిచే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట్రావు మాట్లాడుతూ స్వచ్ఛతకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఈ ప్రకాశరావు, ఏఈ ప్రసన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవీఆర్ శేఖర్, శానిటేషన్ సెక్రటరీలు, వార్డు సభ్యులు హాజరయ్యారు.

కలెక్టర్ రాకతో మెరుగుపడ్డ పారిశుధ్య పనులు

కలెక్టర్ షన్‌మోహన్ నియోజకవర్గ పర్యటనకు రావడంతో అధికారులు ఉరుకులు పరుగులు తీశారు. బుధవారం కలెక్టర్ పర్యటన ఖరారైంది. షెడ్యూల్ రావడంతో నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యపనులుచక్కదిద్దారు. కాల్వల్లో పూడిక తీత తొలగించి పేరుకుపోయిన చెత్తన డంపింగ్ ప్రాంతాలకు తరలించారు. పట్టణ, గ్రామీణవాసులు పారిశుధ్యం మెరుగుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

ఏలేశ్వరం: స్వచ్ఛతే లక్ష్యంగా గ్రామాలను పరిరక్షించుకోవాలని ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పేరవరం, తిరుమాలి గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి ఎ.మల్లికార్జునరావు పాఠశాల విద్యార్థులతో కలిసి వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు అమ్మకం నిషేధించాలని, ప్రతీఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగస్వాములుకావాలన్నారు. ప్రతీ గ్రామాన్ని స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి సూర్యప్రకాశరావు, వేమగిరి సత్యానందం, కర్రి సుబ్బారావు, బొట్టా సురేష్, మెగిలి రవి, నుక్కి పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలి

గొల్లప్రోలురూరల్: పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు, చెందుర్తి తదితర గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలు గు రించి గురువారం ప్రజలకు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర వస్తువులు వినియోగించవద్దని తెలిపారు. గొల్లప్రోలు ఎంపీడీవో జయప్రకాశరావు, ఈవోపీఆర్డీ కుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, దత్తు, రాజేంద్రకుమార్, రాజు, నాగమణి పాల్గొన్నారు.

వైఎస్సార్ అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో చోరీ

శంఖవరం, జూలై 25: శంఖవరం గ్రామంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో చోరీ జరిగినట్టు వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. తొమ్మిది సీలింగ్ ఫ్యాన్లు, మూడు ట్యూబ్ లైట్లు బుధవారం అర్ధరాత్రి చోరీకి గురైనట్టు గుర్తించి అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

'ప్రత్యేకహోదాను విస్మరించారు'

ప్రత్తిపాడు, జూలై25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించి నిధులు మంజూరుచేసే విషయాన్ని అధికార కూటమి ప్రభుత్వం విస్మరించిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. ప్రత్తిపాడులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం ముఖ్య నాయకులసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, ఓబీసీ రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి ఉల్లి వీరగణేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిధులు మంజూరులో విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రంలోని రైల్వే వ్యవస్థపై కేంద్రం చిన్నచూపు చూసిందని రైల్వే బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని విమర్శించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు కందిమళ్ళ శామ్యూల్ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభం

గండేపల్లి, జూలై25: మండలంలోని సూరంపాలెం ఆదిత్యలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సర తరగతులు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈసందర్భంగా గురువారం ఆదిత్య వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వైస్‌ఛైర్మన్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిగా ప్రతీఒక్కరూ నిర్దిష్టమైన లక్ష్యాన్ని కలిగి ఉండాలని విద్యార్థుల లక్ష్యసాధనకు ఆదిత్య పరిపూర్ణమైన సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్య డిప్యూటీ చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, టెక్నికల్ హబ్ సీవో బాబ్జి నీలం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ప్రత్తిపాడు, జూలై 25: ప్రత్తిపాడు పాదాలమ్మ గుడి సమీపంలో పెట్రోల్ బంకు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ప్రత్తిపాడు, యర్రవరం జాతీయ రహదారిపై పోలవరం వంతెనవద్ద 65 ఏళ్ల వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడిని ఢీకొన్న వాహనం తెలియాల్సి ఉంది.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

గొల్లప్రోలు, జూలై 25: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని పిఠాపురం నియోజకవర్గ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సమితి అధ్యక్షుడు ఉలవశెట్టి శ్రీను ఆధ్వర్యంలో వికలాంగులు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావును గురువారం కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, స్వయం ఉపాధి పొందేందుకు సబ్సిడీ రుణాలు అందించాలని, రుణాల మంజూరుకు ఉన్న ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ నిబంధనలు సడలించాలని కోరారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు మొగలి కనకలక్ష్మి, పేపకాయల వరప్రసాద్, స్వామి, రెడ్డి సుబ్రహ్మణ్యం నాయుడు, తంగెళ్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ రికార్డుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలి'

కాకినాడ సిటీ, జూలై 24: రెవెన్యూ రికార్డుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని కాకినాడ ఆర్డీవో ఇట్లకిషోర్ ఆదేశించారు. భద్రతాపరమైన తనిఖీల్లో భాగంగా కార్యాలయ రికార్డ్‌రూమ్‌లో రెవెన్యూ రికార్డులను ఆయన పరిశీలించారు. రికార్డ్ రూమ్‌లవద్ద సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రికార్డురూమ్‌లో భూరికార్డుల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పరిశీలనలో ఆర్డీవో వెంటపరిపాలనాధికారి సౌజన్య పాల్గొన్నారు.

బీజేపీ నేత మృతికి సంతాపం

ఏలేశ్వరం, జూలై25: మాజీ పట్టణ బీజేపీ అధ్యక్షుడు కాలేపు మల్లికార్జున రావు మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు. అనారోగ్యం కారణంగా శుక్రవారం మృతి చెందిన మల్లికార్జునరావు కుటుంబ సభ్యులను ప్రత్తిపాడు బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ గంటా బాలు దొర, నాయకులు గట్టెం వెంకటరమణ, రాతికింద కృష్ణారావు, గొల్లపూడి సత్యనారాయణ, గట్టెం గంగాధర్, బొమ్మిడి లోవరాజు పరామర్శించి, మల్లికార్జురావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అలుపెరుగని విప్లవకారుడు కామ్రేడ్ రాజారావు

జగ్గంపేట, జూలై 25: అలుపెరుగని విప్లవకారుడు కామ్రేడ్ రాజారావు అని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్యా అన్నారు. గురువారం జగ్గంపేట స్టాలిన్ భవన్‌లో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు చాగంటి రాజారావు స్థూపం వద్ద ఆయన వర్ధంతిని నిర్వహించారు. రాజారావు భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పెద్దాపురం డివిజన్‌కార్యదర్శి వి.చిట్టిబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అరుణోదయ సంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వి.భీమశంకరం, ప్రగతి మహిళా సంఘం నాయకులు వి.శాంతి, విజయ, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, దూలన్న, బాలుదొర, ఐ ఎఫ్‌టీయూ పెద్దాపురం డివిజన్ వర్కర్స్ ప్రెసిడెంట్ కారుకొండ శ్రీను, సూరిబాబు, దుర్గారావు, నవీన్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల లెక్చరర్‌కు డాక్టరేట్



తెలుగు లెక్చరర్ మాధవిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సుభాషిణి

పిఠాపురం, జూలై 25: పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కె.మాధవికి డాక్టరేట్ లభించింది. పోతన భాగవతం-అద్వైతతత్వం అనే అంశంపై పరిశోధన చేసినందుకుగానూ తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఈమెకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మాధవిని ప్రిన్సిపాల్ సుభాషిణి తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మన ప్రాచీన గ్రంథాలు, సంస్కృతిపై పరిశోధనలు చేయడానికి ఎంతో అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

'విలీన పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి'

సర్పవరం జంక్షన్, జూలై 25: పదమూడేళ్లగా ఎన్నికలు జరుగని రమణయ్యపేటతో సహా విలీన పంచాయతీలకు కూటమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. గురువారం రమణయ్యపేట కమ్యూనిటీ హాల్లో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ 2013లో గవర్నర్ ఆర్డినెన్స్‌తో కాకినాడ కార్పొరేషన్‌లో 8 గ్రామాలను విలీనం చేశారన్నారు. 2017లో నగరపాక సంస్థతో కలిపి ఎన్నికలు నిర్వహించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఈ గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకుండా 73వ రాజ్యాంగ సవరణకు అధికారులు తూట్లు పొడిచారని విమర్శించారు. గ్రామ పంచాయతీలతో మాదిరిగా ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే కార్పొరేషన్‌లో విలీనంచేసి ఎన్నికలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు కేవీపీ బాలాజీ, రాయుడు అనిల్, తాటికాయల వీరబాబు, చింతపల్లి అజయ్, టీకే మహేష్, మాచరపు సత్యనారాయణ, చంటిరెడ్డి, జోగా అప్పారావు, విజయ్‌కుమార్, కోడి సీతారామయ్య, పాలిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యారంగంలో నెలకొన్న

సమస్యలను పరిష్కరించాలి

కాకినాడ రూరల్, జూలై 25: పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కాకినాడ డీఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు గురువారం ధర్నా నిర్వహించి డీఈవో, ఆర్జేడీ నాగమణికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో 117ను రద్దుచేసి జీవోఎంఎస్ నెంబరు 53ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రీప్రైమరీతో పాటూ 1నుంచి 5వ తరగతులు ఒకే పాఠశాలగా నడపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షావిధానం అమలుచేయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతరంగా రెండు మాధ్యమాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులర్‌చేయాలని కోరారు. కాకినాడజిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు నగేష్ అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి రవిచక్రవర్తి, రాష్ట్రకార్యదర్శి అన్నారం, ప్రభాకర్ వర్మ, సీతారామయ్య, రంగారావు, సోని, సూరిబాబు, మహేష్ పాల్గొన్నారు.

'పేదలకు అన్నపానీయాలు అందించాలన్నదే లక్ష్యం'



భోజనాలు వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ సతీమణి లక్ష్మీదేవి

పిఠాపురం, జూలై 25: పేదలకు అన్నపానీయాలు అం దించాలన్నదే టీడీపీ లక్ష్యమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి తెలిపారు. పిఠాపురం పట్టణంలోని మార్కెట్ సెంటర్‌వద్ద ప్రతి గురువారం వర్మాస్ కావ్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో ఆమె ప్రజలకు భోజనాలు వడ్డించారు. వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండేపూడి సూర్యప్రకాష్, సోము సత్యనారాయణ, కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీను, అల్లవరపు నగేష్, చవ్వాకుల రామచంద్రరావు, సూరవరపు సుబ్బారావు, బస్సా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలి : ఏవో

కరప, జూలై 25: ఇసుకపొర కలిగిన భూములు, మెరక భూముల్లో వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించి అధిక ఆదాయాన్ని పొందాలని మండల వ్యవసాయాధికారి అప్పసాని వెంకట రాజేష్ సూచించారు. కరప నక్కావారిపేటలోని 2ఎకరాల వరిచేలో గురువారం పామాయిల్ మొక్కలను నాటించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొనే భూముల్లో వరికి ప్రత్యామ్నాయంగా పామాయిల్, డ్రాగన్ ఫ్రూట్స్, పైనాపిల్, తదితర పంటలను వేసుకోవడం ఉత్తమమన్నారు. సాగుచేసిన రెండు, మూడేళ్ల నుంచి ఆదాయం సమకూరుతుందని, అప్పటివరకు అంతర పంటలుగా కూరగాయలను సాగుచేసుకోవచ్చన్నారు. ఆశక్తి కలిగిన రైతుల పొలాల్లో ప్రయోగాత్మకంగా ఈ పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. వివరాలకు సమీప రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు. వీఏఏ ప్రశాంత్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించండి



విద్యార్థులకు యూనిఫారాలను అందజేస్తున్న ఎంపీటీసీ నాగేశ్వరరావు

అమీనబాద్(కొత్తపల్లి), జూలై 25: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని టీడీపీ ఎంపీటీసీ బాదిన నాగేశ్వరరావు, సర్పంచ్ నక్కా మణికంఠ విజ్ఞప్తి చేశారు. సాలిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన యూనిఫారాలు, స్కూల్‌బ్యాగ్‌లను గురువారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చక్కని ఉదాహరణలతో విద్యాబోధన చేయాలని విజ్ఞప్తిచేశారు.

ప్రమాదమని తెలిసినా..

● నిబంధనలకు విరుద్ధంగా ఆటోలో ప్రయాణం



కిక్కిరిసిన విద్యార్థులను ఆటోలో తరలిస్తున్న దృశ్యం

గండేపల్లి, జూలై 25: నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో విద్యార్థులను ఆటోలో ఎక్కించుకుని తీసుకెళుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు అంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వారం రోజులు హంగామా చేస్తున్నారే తప్ప పట్టించుకోవడంలేదు. అసలే జాతీయరహదారిపై వాహనాలు వేగానికి అడ్డూ అదుపూ ఉండదు. ఇటీవల వైజాగ్‌లో స్కూల్ ఆటోను లారీ ఢీకొన్న సంఘటనను అధికారులు మరిచిపోయారని పలువురు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేలకు వేలు ఖర్చుపెట్టి చదివిస్తున్నా భద్రత లేకుండాపోయింది. వెనుక భాగంలో నలుగురు విద్యార్థులు కూర్చుంటున్నారని ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

వీకె రాయపురంలో చోరీ



సీసీ పుటేజీలో నిక్షిప్తం అయిన చోరీ సంఘటన

సామర్లకోట, జూలై 25: సామర్లకోట మండలం వెంకట కృష్ణరాయపురం ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన ఉన్న బడ్డీ దుకాణంలో గురువారం తెల్లవారు జామున చోరీ జరిగింది. బడ్డీ దుకాణం తలుపుల తాళాలు పగల గొట్టి లోనికి ప్రవేశించిన దొంగ గల్లా పెట్టిలో దాచి ఉంచిన రూ.28 వేల విక్రయాలకు చెందిన నగదుతోపాటూ దుకా ణంలో సుమారు 10వేల విలువగల సిగరెట్ల ప్యాకెట్లు అపహరించుకుపోయాడు. చోరీ సంఘటన మొత్తం అంతా బడ్డీ దుకాణంలో గల సీసీ పుటేజీలో నిక్షిప్తం అయ్యింది, సామర్లకోట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయ డంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన సర్పంచ్ పరిస్థితి విషమం

సామర్లకోట, జూలై25: సామర్లకోట మండలం వెంకటకృష్ణ రాయపురం గ్రామ సర్పంచ్ మోర్త పూర్ణిమ గురువారం కాకినాడ రోడ్డులో ప్రమాదానికి గురికావడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సర్పంచ్ కుటుంబీకులు ఆమెను పనసపాడు మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కోమాలోకి చేరిన సర్పంచ్ పూర్ణిమ ఆరోగ్యం పూర్తిగా విషమంగానే ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆమెను మెడికవర్ ఆసుపత్రి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ వైద్యం అందిస్తున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సామర్లకోట పోలీసులు ఆరా తీశారు. సర్పంచ్ పూర్ణిమ తన కుటుంబసభ్యులతో కలిసి మోటార్‌సైకిల్‌పై కాకినాడ వెళుతుండగా వెంకటకృష్ణరాయపురం- మాధవపట్నంల మధ్య ఎదురుగా వస్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో గోతిలోకి వెళ్లడంతో వెనుక కూర్చున్న పూర్ణిమ రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలైనట్లు సమాచారాన్ని సేకరించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టేజ్ నిర్మాణానికి శంకుస్థాపన

కిర్లంపూడి, జూలై25: మండలంలోని తామరాడ గ్రామంలో హైస్కూల్, ఎంపీపీ పాఠశాలలో సొంత నిధులతో స్టేజీ నిర్మాణానికి జగ్గంపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు తామరాడ మాజీ సర్పంచ్ అనుకుల శ్రీకాంత్ ముందుకొచ్చారు. గురువారం స్టేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఎంపీటీసీ గోకేడ రాజా, పంచాది నానాజీ, గంధం కృష్ణ, సారా ప్రకాశ్‌రావు, ఉల్లి సురేష్, జి.సత్తిబాబు, పలికెల పల్లారావు, వై.వెంకన్నబాబు ఉన్నారు.

కమిషనర్‌కు మున్సిపల్ ఉద్యోగుల సంఘం శుభాకాంక్షలు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 25: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన భావన ఐఏఎస్‌ను మున్సిపల్ ఉద్యోగల సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సంయుక్త కార్యదర్శి ఎస్ఎంకెజి ప్రసాద్, రామకృష్ణ, జాన్ పాల్, బి.వెంకటక్ష్మి, జయలక్ష్మి, బి.సుజాత ఉన్నారు.